## బూత్‌స్థాయి ఇంటింటి సర్వేపై సమీక్ష



కుత్బుల్లాపూర్ నియోజకవర్గస్థాయి ఏఈఆర్‌ఓ, బీఎల్‌ఓ సూపర్‌వైజర్ అధికారులతో శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్–25లో భాగంగా బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి చేయాల్సిన సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సదస్సులో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ అబ్దుల్ హమీద్ హాజరై చేపట్టాల్సిన సర్వేపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌ఓ, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

*– కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 21*

## వర్సిటీలో సురేశ్‌కుమార్‌కు నివాళి



జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ పరీక్షా విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న తేజావత్ సురేశ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. శనివారం వర్సిటీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతడి కుటుంబసభ్యులకు మనోధైర్యం కల్పించాలని, ఆత్మకుశాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు వర్సిటీ పరీక్షా విభాగాధిపతి,అధ్యాపకులు,విద్యార్థులు తెలిపారు.

*– కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 21*

## ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సఫ్దర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ ప్రజలకు సూచించారు. శనివారం డివిజన్ పరిధిలోని సఫ్దర్‌నగర్ ప్రధాన కూడలి వద్ద అల్‌ఖైర్ సొసైటీ బోరబండ వారి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్ష కేంద్రాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులతోపాటు ఉచితంగా సుమారు 200 మందికి కంటిఅద్దాలు కూడా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే 28 మందికి శస్త్రచికిత్స నిర్వహిస్తామన్నారు. *– అల్లాపూర్, సెప్టెంబర్ 21*

## గాంధీనగర్‌లో



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్ మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం సూరారం మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్ల లక్ష్మీనాథ్, సీనియర్ నాయకులు మేకల ఎల్లయ్య, వైద్యులు డా.అనన్య, యుక్త ఆసుపత్రి సిబ్బంది ఓబుల్‌రెడ్డి, యువజన సంఘం సభ్యులు తిమ్మన్న, శ్రీధర్, వెంకటసాయి, దత్తు, రాంచందర్, పర్వతాలు, అప్పారావు పాల్గొన్నారు.

*– జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 21*

## డ్రగ్స్ సరఫరా.. ముగ్గురి రిమాండ్

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 21 : అక్రమంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ముగ్గురిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ సురేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. కండ్లకోయ ప్రాంతానికి చెందిన ఎ.శరణ్‌రెడ్డి(34), వనస్థలిపురానికి చెందిన కె.పవన్‌కుమార్‌రావు(40), బాచుపల్లికి చెందిన డి.శివశంకర్‌రెడ్డి(34) ముగ్గురు గత కొన్నిరోజుల నుంచి నగరంలో ఎండీఎంఏకు చెందిన డ్రగ్స్‌ను సరఫరా చేస్తూ అవసరం ఉన్నవారికి ఫోన్‌కాల్ ద్వారా విక్రయిస్తారు. ఈనెల 18న విశ్వసనీయ సమాచారం మేరకు ముగ్గురిని పేట్‌బషీరాబాద్‌లో ఒకేచోట ఉండగా పట్టుకొని తనిఖీ చేయగా.. వారి వద్ద రెండు గ్రాముల డ్రగ్స్ లభించింది. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# బీఆర్ఎస్ బలోపేతానికి కార్యాచరణ



ఖాజగూడలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా



శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

- 24న బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 21: శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం ఖాజగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈనెల 24న బీఆర్ఎస్ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరగనుందని, ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు కొమిరిశెట్టి సాయిబాబా పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణ, నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి భవిష్యత్తు కార్యాచరణపై మాట్లాడుతారన్నారు. ఇందుకోసం నియోజకవర్గంలో అన్ని డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాధవరం రంగారావు, మారబోయిన రవియాదవ్, మిద్దెల మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శేఖర్‌గౌడ్, రామకృష్ణగౌడ్, చెన్నంరాజు, బాబుమియా, మహిళా నాయకురాలు అంజయ్మ, నాయకులు రాగం జంగయ్య యాదవ్, దారుక్‌పల్లి సతీశ్, గొరెంక సతీశ్ ముదిరాజ్, శంకరి రాజు ముదిరాజ్, తిరుమలేశ్, అనిల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాభినయం



కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య బావనా వాహిని అధ్యక్షురాలు శోభరాజు ఆధ్వర్యంలో శనివారం అన్నమాచార్య బావనా వాహిని విద్యార్థులలో కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నమాచార్య బావనా వాహిని విద్యార్థులు తొలుత విష్ణు సహస్ర నామ స్తోత్రం, అన్నమాచార్య అష్టోత్తర శతనామావళి, అన్నమ గాయత్రి అనే గురుస్తుతితో ప్రారంభించగా.. శారదా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురువు టీవీ జయశ్రీ వారి శిష్య బృందం కార్తిక, అక్షయని, మణిమేకల, వరుణి, భార్గవి, చైత్ర సంయుక్తంగా వినాయక వందనం, జయలక్ష్మి, వరలక్ష్మి వంటి అంశాలకు చెందిన సంకీర్తనలకు కూచిపూడి నృత్యార్చన చేశారు. అనంతరం పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. శ్రీవేంకటేశ్వర స్వామి వారికి మంగళహారతి ఇచ్చి ప్రసాద వితరణ చేశారు. *– మాదాపూర్, సెప్టెంబర్ 21*

## రోడ్డు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణంపై కమిషనర్‌కు వినతి



కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ శ్రీహరికి ఫిర్యాదు చేస్తున్న దూలపల్లివాసులు

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 21: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లి విలేజ్‌లో రోడ్డును ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం స్థానికులు డప్పు నరేందర్, ఎం.సాయికిరణ్, రమేశ్, క్రాంతి శనివారం కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ శ్రీహరికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు, ఇతర పత్రాలు లేకుండా ఇష్టానుసారంగా జీ+2 నిర్మాణాన్ని చేపట్టడంతోపాటు రోడ్డు స్థలాన్ని ఆక్రమించి కాంపౌండ్‌వాల్ నిర్మాణం చేపట్టారన్నారు. దీనిపై సంబంధిత అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కాలనీవాసులమంతా కలిసి ఆందోళన చేస్తామన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ శ్రీహరి త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన



స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రగతినగర్ ఎన్‌టీఆర్ పార్కులో మొక్కలు నాటుతున్న నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ సౌజన్య తదితరులు

దుండిగల్, సెప్టెంబర్ 21 : పరిసరాల పరిశుభ్రతతోనే మానవుల ఆరోగ్యం ఆధారపడి ఉందని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.సౌజన్య అన్నారు. స్వచ్ఛత హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా శనివారం కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్‌లోని ఎన్‌టీఆర్ పార్కులో స్థానిక కార్పొరేటర్ లక్ష్మీకుమారితో కలిసి కమిషనర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించడంతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చునన్నారు. అనంతరం స్థానికులచే స్వచ్ఛత నిర్వహణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌చార్జి అధికారి సుకృతరెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

– తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో భద్రపర్చాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణరావు అన్నారు. స్వచ్ఛత హీ సేవ–2024లో భాగంగా మున్సిపల్ పరిధిలోని బహదూర్‌పల్లిలో శుక్రవారం వైస్ చైర్మన్ తుడుము పద్మారావుతో కలిసి కమిషనర్ కె.సత్యనారాయణరావు ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇంటికి వచ్చే స్వచ్ఛ ఆటోకి ఇవ్వాలని మహిళలకు తెలియజేశారు. గార్బేజ్ వనరబుల్ పాయింట్స్ గుర్తించి చెత్త కుప్పలను శుభ్రం చేయించారు. చికెన్, మటన్ షాపుల వద్ద ప్లాస్టిక్ కవర్లు వాడకుండా తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేర్వేరు చేసి మున్సిపల్ పర్మిషన్ ఇచ్చిన ఏజెన్సీల వారికే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ ఈ.సాత్విక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్, అంజయ్య, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొంపల్లిలో సువార్త ప్రవచనాలు



మంచి వార్త ప్రకటించండి–24 పేరిటా యెహోవా సాక్షుల ప్రాథేశిక ప్రవచనాల సమావేశం కొంపల్లిలోని హైందవ గౌరిక్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం కొనసాగాయి. మూడురోజులపాటు జరిగే ఈ సదస్సులో దాదాపుగా 2500 మంది హాజరయ్యారు. ప్రతిరోజు చెడు వార్తలతో నిండి ఉన్న నేటి సమాజంలో మంచి వార్త ఎందుకు అవసరం అనే దానిపై చర్చించారు. పిల్లలు, పెద్దలు, కుటుంబాలు పాజిటివ్‌గా ఎలా ఆలోచించాలో చర్చించారు. ఈ సదస్సులో కోఆర్డినేటర్ ఇసాక్‌జెన్ని, యెహోవా సాక్షుల స్థానిక ప్రతినిధి కె.వినోద్ కుమార్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు. *– కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 21*

## అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు

దుండిగల్, సెప్టెంబర్ 21: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్, హెచ్‌ఏఎల్ కాలనీలోని ప్లాట్ నంబర్ 614 వద్ద చేపట్టిన అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలంటూ కాలనీకి చెందిన ఓ వ్యక్తి శనివారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు నిర్మాణం జీహెచ్‌ఎంసీ భవన నియమాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతుందని, అంతేకాకుండా ఈ నిర్మాణం ఉన్న ప్రదేశం పక్కనే హైటెన్షన్ విద్యుత్ తీగలు కూడా ఉన్నందు వల్ల ఇది చాలా ప్రమాదకరంగా మారుతుందన్నారు. జీ+3 అంతస్థులతోపాటు పెంట్‌హౌస్ నిర్మాణం వల్ల స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, చట్టబద్ధమైన నిర్మాణాలు చేపట్టకుండా నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ, ప్రజా మౌలిక వసతులకు హాని కలిగించే అవకాశం ఉన్నందున తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## దంపతుల ముసుగులో వ్యభిచారం

అల్లాపూర్, సెప్టెంబర్ 21: దంపతుల ముసుగులో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం చేస్తున్న నిర్వాహకులను సైబరాబాద్ ఏహెచ్‌టీయూ(యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్)రైడ్ చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో ప్లాట్‌ను వంశీకృష్ణ(29), ఓ మహిళ దంపతులమని చెప్పి గత కొంతకాలం కిందట అద్దెకు తీసుకున్నారు. దంపతుల ముసుగులో వ్యభిచారాన్ని నడిపిస్తున్నారు. ఇటీవల అపార్ట్ సమీపంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో లడ్డూ ప్రసాదానికి జరిగిన వేలం పాటపాడి లడ్డూ సొంత చేసుకున్నారు. అంతోనే వీరు ఇలా వ్యభిచారం చేస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులకు దొరికిపోవడంతో స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే వంశీకృష్ణ, ఆ మహిళ గతంలో కూడా మాదాపూర్‌లో వ్యభిచారం చేస్తూ పోలీసులకు చిక్కి జైలు జీవితం గడిపింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీరైన వంశీకృష్ణ, అలియాస్ ప్రవీణ్, అలియాస్ నాని కూడా జల్సాకు అలవాటు పడి తనకు ఉన్న నైపుణ్యంతో అడ్డదారిలో డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఈ క్రమంలో ఆ మహిళ తోడు కావడంతో ఇద్దరు కలిసి షోషల్ మీడియా ద్వారా లాగిన్ అయి విటులను ఆకర్షించేవారు. కొత్త కస్టమర్లను ఆకర్షించేందుకు పాత వారిచే తమ సర్వీసు బాగుందంటూ టెస్టిమోనిల్స్ కూడా టెలిగ్రామ్, వాట్సాప్‌లతో రాయించుకునేవారు. ఇలా ఆ నోట ఈ నోట సైబరాబాద్ ఏహెచ్‌టీయూ పోలీసులకు సమాచారం రావడంతో శుక్రవారం పథకం ప్రకారం రైడ్‌చేసి వంశీకృష్ణ, ఆ మహిళతో పాటు ఒక విటుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు ల్యాప్‌ట్యాప్‌లు, ఐదు ఫోన్లు, రూ.6,280 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పిటా కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని పోలీసులు తెలిపారు.

## కమ్యూనిటీహాల్ నిర్మించాలని కమిషనర్‌కు వినతి

దుండిగల్, సెప్టెంబర్ 21: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, 30వ డివిజన్ జర్నలిస్ట్స్ కాలనీలో స్థానిక ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీహాల్ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కమిషనర్ డి.సౌజన్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్ట్స్ కాలనీ ప్రజలతోపాటు పరిసర కాలనీలకు చెందిన ప్రజలు ప్రతి ఏటా గణేశ్ నవరాత్రి వేడుకలు, బతుకమ్మ ఉత్సవాలు వంటివి జరుపుకుంటున్నామని, అయితే అందుకు సరైన మైదానం గానీ, కమ్యూనిటీహాల్ గానీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పక్కనే ఉన్న సర్వే 334లో కమ్యూనిటీహాల్ నిర్మాణంతోపాటు మౌలికవసతులు కల్పించాలని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ను ఇది వరకే కోరగా ఆయన సానుకూలంగా స్పందించడంతోపాటు తన ఎమ్మెల్యే కోటా నిధులను సైతం కేటాయిస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో జర్నలిస్ట్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అస్కాని మారుతీసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య, ప్రధాన కార్యదర్శి గుంటూరు శేఖర్, ఉపాధ్యక్షులు కొలెపాక వెంకట్, సభ్యులు కోట కృష్ణారావు, పితాని శ్రీనివాసరావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

దుండిగల్, సెప్టెంబర్ 21: దేశ పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అమెరికా విదేశీగడ్డపై భారతదేశ రాజ్యాంగాన్ని, దేశ ప్రతిష్టను భంగపరిచే విధంగా మాట్లాడటం పట్ల నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ శ్రేణులు శనివారం ఆందోళన నిర్వహించాయి. ఈ సందర్భంగా నిజాంపేట్ హనుమాన్ టెంపుల్ దగ్గర నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార పార్టీ ప్రతినిధి దాసి నాగరాజు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మేడ్చల్ జిల్లా అర్బన్ కన్వీనర్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. అనంతరం నిజాంపేట్ హనుమాన్ టెంపుల్ చౌరస్తా దగ్గర రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో మీడియా సెల్ కన్వీనర్ సుమన్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్, స్వచ్ఛ భారత్ కన్వీనర్ శిల్లారెడ్డి, నిజాంపేట్ బాచుపల్లి అధ్యక్షులు భిక్షపతియాదవ్, ప్రసాద్ రాజు, నిజాంపేట్ నగర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గుప్తా, కౌశిక్, అంజి, కొంకిరాము, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించాలి

### డిప్యూటీ సీఈవో అబ్దుల్ హమీద్

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 21: అర్హులైన వారందరికీ ఓటరు జాబితాలో పేరును నమోదు చేయాలని, ఓటరు జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించాలని డిప్యూటీ సీఈవో అబ్దుల్ హమీద్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం ఈఆర్‌వో కార్యాలయంలో ఓటరు జాబితా 2025 రూపకల్పనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు పరిశీలించాలన్నారు. జాబితా నుంచి చనిపోయిన వారు, ఇతరుల పేర్లను తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. చనిపోయిన ఓటర్ల పేర్లను తొలగించడం కోసం ఫారం–7ను ఉపయోగించాలన్నారు. ఇంటింటి సర్వేను ఈ నెల 24లోగా పూర్తిచేయాలని, ఈ నెల 29న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించాలన్నారు. ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి అర్హులైన వారందరికీ ఓటు హక్కును కల్పించాలన్నారు. ఎలాంటి విమర్శలు లేకుండా పారదర్శకంగా ఓటరు జాబితాను ప్రచురించాలన్నారు. ఎన్నికల విభాగం సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. కార్యాక్రమంలో ఈఆర్‌వో రమేశ్, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్స్ ఉన్నారు.

## గణనాథుడికి పూజలు



కేపీహెచ్‌బీ కాలనీ: బాలాజీనగర్ కాలనీలో గణనాథుడి మండపం వద్ద కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పి.బాబురావులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌చౌదరి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఐస్‌క్రీం వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రావు, భక్తులు ఉన్నారు.



కేపీహెచ్‌బీ కాలనీ: కైత్లాపూర్‌లో గణనాథుడి పూజలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, బీఆర్ఎస్ పార్టీ నేతలు



ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుడి లడ్డూను రూ.1.40 లక్షలకు వేలంలో దక్కించుకున్న రావుల యాకయ్య గౌడ్

*– మియాపూర్, సెప్టెంబర్ 21*

## నిష్పక్షపాతంగా పని చేస్తా....

### బాధ్యతలు స్వీకరించిన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీని అభినందిస్తున్న శాసనసభ,శాసన మండలి చైర్మన్లు గడ్డం ప్రసాద్, గుత్తా సుఖేందర్‌రెడ్డి

మియాపూర్, సెప్టెంబర్ 21 : ప్రజా పద్దుల కమిటీ చైర్మన్‌గా తనకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని, రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తానని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. ప్రజల కోసం వెచ్చించే నిధులపై పరిశీలన విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని, ఎందరో మహనీయులు అలంకరించిన ఈ స్థానానికి మచ్చరానీయనన్నారు. పీఏసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గాంధీని శాసనసభ, శాసన మండలి స్పీకర్లు గడ్డం ప్రసాద్, గుత్తా సుఖేందర్‌రెడ్డి సహా, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు సహా మంత్రులు, సభ్యులు శనివారం అభినందించి సత్కరించారు.

– పీఏసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గాంధీని చొప్పదండి ఎమ్మెల్యే సత్యం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

– వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్ డివిజన్‌లలో పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

## ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి



జాబితా సవరణపై బీఎల్‌వోతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య. చిత్రంలో డీసీ మోహన్‌రెడ్డి

మియాపూర్, సెప్టెంబర్ 21: ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని ఎన్నికల కార్యాలయం డిప్యూటీ కలెక్టర్, జాబితా సవరణ పరిశీలన ప్రత్యేకాధికారి చెన్నయ్య పిలుపునిచ్చారు. పొరపాట్లకు తావు లేకుండా ఓటర్ల వివరాలను నవీకరించాలని సూచించారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ఈఆర్‌వో కార్యాలయంలో అధికారులతో శనివారం ప్రత్యేకాధికారి సమీక్ష నిర్వహించారు. అనంతరం శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల పరిధిలో చేపడుతున్న ఇంటింటి సర్వేను డీసీలు ముకుందారెడ్డి, మోహన్‌రెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని, ఓటర్ల వివరాలను నమోదు చేసుకుని నవీకరించాలని ఆదేశించారు. మరణించిన ఓటర్ల వివరాలను జాబితాలో నుంచి తొలగించేందుకు వివరాలను సేకరించి నివేదించాలని ప్రత్యేకాధికారి చెన్నయ్య స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా సర్కిళ్ల ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, బీఎల్‌వోలు ఉన్నారు.

## లింగంపల్లిలో 'పోషక ఆహార నెల కార్యక్రమం'



చైల్డ్ ఫర్ వరల్డ్ సోలిడారిటీ(సీడబ్ల్యూఎస్), చైల్డ్ ఫండ్ ఇంటర్నేషనల్ యూఎస్‌ఏ సంస్థల సహకారంతో రంగారెడ్డి జిల్లా మహిళా, శిశు అభివృద్ధిశాఖ, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి గోపీనగర్‌లో 'పోషక ఆహార నెల కార్యక్రమం' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మహిళ, శిశు అభివృద్ధి శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మౌతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపూర్ణిమ, సీపీడీఓ కవిత, శేరిలింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అన్నపూర్ణలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా మహిళలకు పోషక ఆహారం నెల కార్యక్రమంపై అవగాహన కల్పించడంతోపాటు గర్భవతులను సన్మానించారు. చైల్డ్‌ఫర్ వరల్డ్ సోలిడారిటీ ప్రతినిధి శ్రీశైలం, పలువురు ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. *–శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 21*

## అలరించిన 'రసోల్లాస్' నృత్య ప్రదర్శనలు

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు నృత్యకారులు చేసిన ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. డాక్టర్ రమాదేవి ఆధ్వర్యంలో నేషనల్ ఇండియన్ డాన్స్ ఫెస్టివల్ 'రసోల్లాస్'ను నిర్వహించారు. ఇందులో భాగంగా సురేంద్రనాథ్, బిజినాలు అర్ధనారీశ్వరం, ఆదిత్య హృదయం అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించగా, అనిత ముక్త శౌర్య ముఖ చలం, చలియెహ్ కుంచనమో అంశాలను మోహినియాట్టంలో ప్రదర్శించారు. ముంబై నుంచి విచ్చేసిన కాశ్మీర త్రివేది బృందం మహామృత్యుంజయ స్తోత్రం, శివ పంచాక్షరి స్తోత్రం, తిల్లాన అంశాలను భరతనాట్య నృత్య రూపకంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. *– కొండాపూర్, సెప్టెంబర్ 21*

